ఈనాడు
ములుగు
గురువారం అక్టోబరు 17, 2024
7

పత్తి అమ్మకాల్లో సందేహాలా.. నివృత్తి చేసుకోండి

నేడు జేడీఎం శ్రీనివాస్‌తో

ఈనాడు ఫోన్ ఇన్

పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 4,10,632 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పత్తిలో తేమశాతం ఆధారంగా సీసీఐ ధర నిర్ణయిస్తుంది. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర రావాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. అకాల వర్షాలతో రంగు మారిన పత్తి అమ్మకం ఎలా?.. సీసీఐ నిబంధనలు ఏమిటి? తదితర సందేహాలు రైతులను వేధిస్తున్నాయి. గురువారం కింది నెంబర్లకు ఫోన్ చేసి వాటిని నివృత్తి చేసుకోవచ్చు. మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ సమాధానాలు ఇస్తారు.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్

సంప్రదించాల్సిన చరవాణి నెంబరు
73307 33669, 8985131057
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

‘ఇలాగైతే కళాశాలలు నిర్వహించలేం’

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు బోధనా రుసుము, ఉపకార వేతనాలు చెల్లించడంలేదని, ఇలాగైతే తాము కళాశాలలు నిర్వహించలేమని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం (టీపీడీఎంఏ) నాయకులు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో మూడ్రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు బంద్ చేసి, నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. బోధనారుసుం మంజూరు చేయకపోతే కళాశాలలు నిర్వహించలేక అప్పులపాలై మూసివేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం భవనాల అద్దె, అధ్యాపకులు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. ఏడాది కిందట విడుదల చేసిన టోకెన్ నెంబర్లకు సంబంధించిన రూ.600 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేయూ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి జి.వేణుమాధవ్, టీపీడీఎంఏ సభ్యులు శ్రీధర్‌రావు, రవీంద్రనాథ్, వెంకట్, జిల్లా కోఆర్డినేటర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు, న్యూస్‌టుడే: ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ టీఎస్. దివాకర అన్నారు. బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని వెంకటాపూర్, మంగపేట మండలాల్లోని భూమి కేసుల విచారణ జరపాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అట్రాసిటీ అంశాలతో ముడిపడి ఉన్న సంఘటనల గురించి ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్సీ ఎస్టీ వసతిగృహాల్లో అమలు చేస్తున్న మెనూను ప్రదర్శించాలన్నారు. కమిటీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకొని సమస్యలు పరిష్కార దిశగా కృషి చేస్తామని వివరించారు. డీఎస్పీడీ సీఆర్‌బీ రాములు, అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య, డీఏవో సురేష్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, బీసీ సంక్షేమాధికారి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక ఆవిష్కరణ

ములుగు: పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం రూపొందించిన తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖ చిత్రం-2024 పుస్తకాన్ని దివాకర తన ఛాంబర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమానికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ పుస్తకంలో పొందుపర్చినట్లు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులకు పుస్తకం చక్కగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఒక్కో పుస్తకాన్ని రూ.150 చెల్లించి జిల్లా ప్రణాళిక కార్యాలయంలో విక్రయించనున్నట్లు సూచించారు. సీపీవో ఎం.ప్రకాష్, డీపీఆర్‌వో రఫిక్, డిప్యూటీ ఎస్‌వోలు లక్ష్మీనారాయణ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


బెస్తగూడెం యూపీఎస్‌లో విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయురాలు కల్యాణి

అస్తవ్యస్తంగా నిల్వచేసిన అంగన్‌వాడీ సామగ్రి ఇది. ములుగు మండలం జివంతరావుపల్లి ప్రాథమిక పాఠశాల భవనంలో ఒకే గది ఉంది. ఇందులోనే అంగన్‌వాడీ కేంద్రం కూడా కొనసాగుతోంది. ఈ బడిలో ఇప్పటి వరకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నారు. తాజాగా ఈ పాఠశాలకు మరొకరిని నియమించగా, టీచర్ల కొరత తీరింది. ఈ పాఠశాలకు ఒకే గది ఉండడం, ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే గదిలో బోధించడం ఇబ్బందిగా మారనుంది.



గురుతర బాధ్యత మీదే..!

కొత్త ఉపాధ్యాయుల నియామకంతో ప్రభుత్వ పాఠశాలల్లో మార్పు వచ్చింది. ఈనెల 15న కొత్త ఉపాధ్యాయులకు బడుల కేటాయింపు ప్రక్రియ మంగళవారం ముగిసింది. బుధవారం ఎంఈవో చేతులమీదుగా నియామకపు పత్రాలను అందుకుని సంబంధిత స్కూలు కాంప్లెక్సుకు వెళ్లి అక్కడి ప్రధానోపాధ్యాయుడి వద్ద రిపోర్టు చేశారు. నేరుగా తనకు కేటాయించిన పాఠశాలకు వెళ్లి విధుల్లో చేరారు.

ములుగు, న్యూస్‌టుడే:

మౌలిక వసతులపై దృష్టి అవసరం

ఉపాధ్యాయుల రాకతో బోధన సమస్య తీరినప్పటికీ.. పలు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పిల్లలకు కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. పలుచోట్ల తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మౌలిక సౌకర్యాల కల్పనపై మరింత దృష్టి సారించాలి.

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మార్పు

కొత్త ఉపాధ్యాయుల నియామకంతో ఇప్పటి వరకు ఏకోపాధ్యాయునిగా ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులు బోధించే ప్రాథమిక పాఠశాలలో ఎంత మంది విద్యార్థులున్నా ఆ ఒక్క ఉపాధ్యాయుడే పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి. ఏదైనా అవసరమై ఉపాధ్యాయుడు బడికి రాకపోతే విద్యార్థులకు సెలవే. దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినా.. ఆ పాఠశాల శాశ్వతంగా మూతపడాల్సిందే. అలాంటి సమస్యలకు ప్రభుత్వం తెరదించింది. ఏకోపాధ్యాయ పాఠశాలలన్నింటిలో మరొకరిని నియమించడంతో మార్పు వచ్చింది.

జిల్లా పరిధిలో 266 ప్రాథమిక, 44 ప్రాథమికోన్నత, 38 ఉన్నత పాఠశాలు ఉన్నాయి. ఈ బడుల్లో ఖాళీలను గుర్తించి 176 మందిని నియమించగా, నూతనంగా వారు విధుల్లో చేరారు. దీంతో జిల్లాలోని బడుల్లో ఉపాధ్యాయుల కొరత తీరింది. ఉపాధ్యాయులు లేరనే కారణంతో చాలా గ్రామాల్లో ప్రైవేటు బడులను ఆశ్రయిస్తుండటంతో.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గిపోతోంది. ఇప్పుడు ఆ సమస్య తీరనుంది.

176 మంది నియామకం

జిల్లాలో స్కూలు అసిస్టెంట్లు, భాషా పండితులు, ఎస్జీటీలు మొత్తం 192 ఖాళీలు ఉన్నట్లు ప్రకటించారు. వీటి నియామకానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. డీఎస్సీ నిర్వహణ తర్వాత 176 మంది మాత్రమే ఎంపికయ్యారు. ఇందులో భాషా పండితులు హిందీ-8, తెలుగు-7, స్కూలు అసిస్టెంటు బయోలాజికల్ సైన్స్ 5, ఫిజికల్‌సైన్స్-1, గణితం-3, తెలుగు-3, ఇంగ్లీషు-5, హిందీ-3, సోషల్-9, స్పెషల్ ఎడ్యుకేషన్-3, ఫిజికల్ డైరెక్టర్-1, పీఈటీ-1, ఎస్జీటీ 122, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్-5 పోస్టులకు ఎంపికైన వారికి పాఠశాలల కేటాయింపు జరిగింది.

యువతే అధికం

2024 డీఎస్సీలో నియామకమైన 176 మంది ఉపాధ్యాయుల్లో అధికంగా యువతే ఉంది. 30 ఏళ్లలోపున్న వారు 95 మంది ఉన్నారు. 30 - 40 ఏళ్ల వయసు కలిగిన వారు 68 మంది ఉన్నారు. 40 ఏళ్లకు పైబడిన వారు 13 మంది ఉన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే వృత్తిలో చిన్న వయసులోనే చేరిన వీరిపై గురుతర బాధ్యత ఉంది. వినూత్న బోధనా పద్ధతులు, ఆధునిక విద్యావిధానాలతో విద్యార్థులను వివిధ రంగాల్లో ఉన్నతులుగా ఎదిగేలా కృషి చేయాల్సి ఉంటుంది.

జిల్లా వివరాలు

పాఠశాల	సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక	266	9,171
ప్రాథమికోన్నత	44	2,713
ఉన్నత	38	5,046

విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి

కుర్సం మౌనిక, ఎస్జీటీ, ఎంపీపీఎస్ కమ్మరిగూడెం, వెంకటాపురం



మాది వెంకటాపురం మండలంలోని సుడిబాక గ్రామం. డీఎడ్ పూర్తి చేసి డీఎస్సీలో ఎంపికయ్యా. వినూత్న పద్ధతుల్లో విద్యను బోధిస్తూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తా. చదువుతోనే ఉన్నతి సాధ్యమనే విషయాన్ని భావిపౌరులకు వివరిస్తాం. ప్రభుత్వం అమలు చేస్తున్న పాఠ్య ప్రణాళికతో పాటు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు చెప్పేందుకు సంసిద్ధమయ్యా.

– న్యూస్‌టుడే, వెంకటాపురం

అందరూ విధుల్లో చేరారు

- జి.పాణిని, డీఈవో, ములుగు

కొత్తగా నియమితులైన 176 మంది ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. దీంతో జిల్లా పరిధిలో ఉపాధ్యాయుల కొరత తీరింది. విద్యార్థులకు ఇక నుంచి విద్యాబోధన సాఫీగా సాగనుంది.

సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయి..

ములుగు, న్యూస్‌టుడే: జిల్లాలో సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయని, ప్రస్తుతం వాటి తీవ్రత లేదని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ. అప్పయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విష జ్వరాలతో మరణిస్తున్నట్లుగా వస్తున్న వదంతులపై ఎవరూ భయాందోళనలకు గురి కావద్దని సూచించారు. గత నాలుగు నెలలుగా సంభవించిన మరణాల్లో గుండె జబ్బులు, కిడ్నీ, కాలేయ సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు వయోవృద్ధులు ఉన్నారన్నారు. మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలతో మరణాలు జరగలేదని స్పష్టం చేశారు. వర్షాకాలం మొదలైన జూన్ నెల నుంచి ప్రత్యేక ప్రణాళికను తయారు చేసుకొని జిల్లా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి ఇంటింటా సర్వే చేపట్టి మలేరియా, డెంగీ వ్యాధులను తగ్గించడంలో సఫలీకృతమైనట్లు వివరించారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 35 మలేరియా, 45 డెంగీ కేసులను గుర్తించి పూర్తి చికిత్సను అందించినట్లు పేర్కొన్నారు.

ఏడాదిలోగా రుణం చెల్లిస్తే వడ్డీ రాయితీ

ములుగు రూరల్, న్యూస్‌టుడే: రైతులు తీసుకున్న పంట రుణాలు ఏడాదిలోపు చెల్లిస్తే వడ్డీ రాయితీ వస్తుందని నాబార్డ్ ఏజీఎం రవిచైతన్య అన్నారు. ములుగు మండలం భూపాల్‌నగర్ గ్రామంలో ఏపీజీవీబీ బ్రాంచి మల్లంపల్లి ఆధ్వర్యంలో కళాజాత బృందం జానపద గేయాలు, ఆటపాటల ద్వారా బుధవారం గ్రామస్థులకు ఆర్థిక అక్షరాస్యత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రవిచైతన్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఖాతాదారులు బ్యాంకు అందించే సేవలను వినియోగించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనలో అర్హత ఉన్న ప్రతి ఖాతాదారులు ఈ పథకంలో చేరాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏపీజీవీబీ ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్, బ్యాంకు అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరలో శాశ్వత ఏర్పాట్లకు కృషి

వివరాలు 8లో..

ఉపాధి కోర్సులపై అవగాహన అవసరం


పీవో చిత్రామిశ్రాకు వివరాలు అందజేస్తున్న అధికారులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఐటీఐలో ప్రవేశపెట్టిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని ఉపాధి, శిక్షణ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకుడు సీతారాములు ఐటీఐ ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. బుధవారం ఆయన ఏటూరునాగారంలోని ఆర్‌ఐటీఐని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యంత శక్తి సామర్థ్యాలున్న గిరిజన యువత ఏటూరునాగారం, వాజేడు ఐటీఐలలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఆసక్తిని కనబరచడం లేదని, దీనికి అవగాహన కల్పించకపోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్, సిబ్బంది గిరిజన గ్రామాలను సందర్శించి యువతను సమీకరించి సంబంధిత కోర్సులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రిన్సిపల్స్ సిబ్బందితో సమీక్షించిన అనంతరం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాను కలిసి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల పట్ల చర్చించారు. అనంతరం పీవో మాట్లాడుతూ.. ఈ కోర్సుల ద్వారా లభించే ఉపాధి అవకాశాలపై ఈ నెల 18న ఆదివాసీ గిరిజన సంఘాల సాకారంతో యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తానని పేర్కొన్నారు.

విద్యుత్తు అధికారుల పొలం బాట


నియంత్రిక వోల్టేజీని పరిశీలిస్తున్న డీఈఈ నాగేశ్వర్‌రావు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: మండల పరిధి చల్వాయి గ్రామంలోని హాస్టల్‌గడ్డ వద్ద విద్యుత్తు నియంత్రికను బుధవారం డీఈఈ పుల్సం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలోని విద్యుత్తు అధికారులు, సిబ్బంది పరిశీలించారు. నియంత్రిక వద్ద మీటర్ సాయంతో డీఈఈ వోల్టేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావుతో మాట్లాడుతూ.. మోటార్లు కాలిపోకుండా ఉండాలంటే రైతులు తప్పనిసరిగా కెపాసిటర్లు అమర్చుకోవాలని, దీంతో లోవోల్టేజీ సమస్య తలెత్తదని చెప్పారు. నియంత్రికలు కాలిపోతే వెనువెంటనే స్థానిక విద్యుత్తు సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఒకవేళ అప్పటికీ ఆలస్యమైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పస్రా ఏఈ దేవ్‌సింగ్, సిబ్బంది వేణు, తిరుపతి, రంజిత్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

పున్నమి వెలుగుల్లో రామప్ప ఆలయం

కాకతీయుల కాలం నాటి రాతి కట్టమైన రామప్ప ఆలయం బుధవారం రాత్రి పున్నమి వెలుగుల్లో విరాజిల్లుతోంది. పౌర్ణమి గడియలకు ఒక రోజు ముందే ఆలయ శిఖరంపై భాగంలో చంద్రుడి వెలుగులు చూపరులను కనువిందు చేసింది. ఎలాంటి కృత్రిమ వెలుగులు లేకున్నా.. ప్రకృతి వెలుగుల్లోనే ‘న్యూస్‌టుడే’ తన కెమెరాలో ఈ చిత్రాన్ని బంధించింది. వరల్డ్ హెరిటేజ్ శిబిరానికి వచ్చిన వాలంటీర్లు ఈ అద్భుత దృశ్యాన్ని వారి కెమెరాల్లో బంధించుకోవడానికి పోటీ పడ్డారు.

– న్యూస్‌టుడే, వెంకటాపూర్



‘అధికారుల నిర్లక్ష్యంతోనే నష్టపోయాం’

కమలాపురం(మంగపేట), న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ పొందిన 38 మంది కార్మికులకు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అన్యాయం జరిగిందని, ఒక్కో కార్మికుడు రూ.5 లక్షల వరకు నష్టపోయారని బిల్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక విలేకర్లతో కార్మికులు గులగుట్ట విజయరావు, గూడా యాదగిరి ముత్తినేని వెంటకేశ్వర్లు, బత్తుల వెంకట నారాయణ మాట్లాడారు. రావాల్సిన వేతనాలు, ఇతర అలవెన్సుల విషయంలో నష్టం జరిగిందన్నారు. లేబర్ కోర్టులో కేసు నడుస్తుండగానే వరంగల్ జాయింట్ కమిషనర్ వద్ద చర్చలు జరుపుతున్న సమయంలో ఒక్కో కార్మికునికి రూ.7 లక్షలు వస్తున్నాయని చెప్పి డబ్బులు జమచేస్తామని సంతకాలు చేయించారన్నారు. విషయం తెలుసుకున్న ఐకాస నాయకులు కొంతమంది జాయింట్ కమిషనర్ వద్దకు వెళ్లి 38 మందికి రూ.7 లక్షలు ఇస్తే మిగిలిన 650 మందికి ఈ విధంగానే ఇవ్వాల్సి వస్తుందని, ఐకాస నాయకులు యాజమాన్యంతో కుమ్మక్కై రూ.2 లక్షలు మాత్రమే వచ్చేలా చేశారని ఆరోపించారు. ఇందులో కార్మికశాఖ అధికారుల హస్తం కూడా ఉందన్నారు. కార్మికులను మోసం చేయకుంటే ఎందుకు సంతకాలు చేయించారని ప్రశ్నించారు. న్యాయం జరిగేలా సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై అన్ని రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు ముందుకొచ్చి కార్మికులకు జరిగిన అన్యాయంపై నిలదీయాలని కోరారు.

అడవుల సంరక్షణకు అంకితభావంతో పని చేయాలి


శిక్షణ బీట్ అధికారులకు సూచనలిస్తున్న అటవీక్షేత్రాధికారి మాధవీ శీతల్

లక్నవరం జలాశయం,(గోవిందరావుపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అడవుల సంరక్షణ చేపట్టాలనే సంకల్పంతో నూతనంగా నియామకాలను చేపట్టిందని పస్రా అటవీక్షేత్రాధికారిణి మాధవీ శీతల్ చెప్పారు. ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ అడవుల సంరక్షణ కోసం అంకితభావంతో పని చేయాలన్నారు. హైదరాబాద్ దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర ఫారెస్టు అకాడమీ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న 33 మంది శిక్షణ బీట్ అధికారులు బుధవారం లక్నవరం జలాశయాన్ని సందర్శించారు. ఎనిమిది కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ చేశారు. లక్నవరం ఫెస్టు గురించి మాధవీశీతల్ వివరించారు. లక్నవరం ఎకో పార్కును సైతం సందర్శించారు. లక్నవరం అడవులకు ప్రత్యేకమైన తెల్ల పునికి, నీటీ కానుగ చెట్ల గురించి వివరించారు. లక్నవరం జలాశయం పరిసర ప్రాంతాలతో పాటు జలాశయం తూములను కూడా చూపించారు. ఈ సందర్భంగా మాధవీ శీతల్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అడవుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ ఎం.వంశీకృష్ణ, పస్రా సెక్షన్ అధికారులు ఎం.వేణు, గోపాల్‌రెడ్డి, ఎఫ్‌బీఓ టి.దీప్‌లాల్ పాల్గొన్నారు.

అసలేం జరుగుతోంది?

● మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ ఎమ్మెల్యేల అసంతృప్తి

రంగంపేట, న్యూస్‌టుడే

ఓరుగల్లు కాంగ్రెస్ రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా కాంగ్రెస్ పెద్దలను కలిసి వరుస ఫిర్యాదులు చేయడం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని నెలలుగా ఇది అంతర్గతంగా సాగినా ఇటీవల జరిగిన ఘటనలతో బహిర్గతమైంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షిని ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్యనాయకులు కలిశారు. బుధవారం ఉదయం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ మాట్లాడే ప్రయత్నం చేసినా సమయం లేకపోవడంతో వాయిదా పడింది. దిల్లీ నుంచి వచ్చాక కలిసే అవకాశం ఉంది.



పార్టీకి నష్టం..

● వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మంత్రి సురేఖ ఒకవైపు, సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు మరోవైపు ఉండడంపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


● మంత్రి వ్యవహరిస్తున్న తీరు, ఒంటెద్దు పోకడలతో పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధిష్ఠానం పెద్దలకు వివరించినట్లుగా తెలిసింది. శాసనసభ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు సుప్రీం అని.. ఏదీ జరిగినా తామే కదా జవాబుదారీ అని టీపీసీసీ అధ్యక్షుడికి వివరించారు. ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా నాయకులను సమన్వయం చేయాల్సిన బాధ్యత జిల్లా మంత్రులపై ఉందని.. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు..

● మంత్రి సురేఖ వాదన మరోలా ఉంది. తమను నమ్ముకున్న కార్యకర్తల కోసం ఉక్కు పిడికిలితో సమాధానం చెబుతామని బహిరంగంగా ప్రకటించారు. పరకాల నియోజకవర్గంతో చాలా అనుబంధం ఉందని, కార్యకర్తలపై దాడులు, పోలీసు కేసులు పెడితే చూస్తూ ఉండాలా? అని వ్యాఖ్యానించారు. గీసుకొండ పోలీసు స్టేషన్‌లో, ధర్మారంలో జరిగిన దాడులు, ఇతర విషయాలను సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించినట్లుగా తెలిసింది. పార్టీకి నష్టం కలిగించడం తన ఉద్దేశం కాదని తెలియజేసినట్లు సమాచారం.

త్వరలోనే సమావేశం

వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో త్వరలోనే సమావేశం ఉంటుందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఉమ్మడి జిల్లా నాయకులతో మాట్లాడే అవకాశాలున్నాయి. అందర్ని సమన్వయం చేసే బాధ్యత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించారు.

ఇదేందయ్యా ఇది..



జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రం శివారులోని విద్యుత్తు సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రధాన విద్యుత్తు లైన్‌కు పిచ్చి తీగలు అల్లుకున్నాయి. ఏకంగా 10 అడుగుల మేర చుట్టుకోవడంతో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతూ, తెగిపోయేలా న్నాయి. వాటిని తొలగించి, ముందస్తు ప్రమాదాన్ని నివారించాలని స్థానిక రైతులు, ఆయా మార్గంలో వెళ్లే ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ రణధీర్‌ను వివరణ కోరగా.. తొలగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, పాలకుర్తి

నలుపు వరి.. ఆరోగ్య సిరి



చుట్టూ పచ్చని పొలాలు. . మధ్యలో నల్లగా ఉన్న పంటను చూస్తే తెగులు సోకిందని అనుకుంటే పొరపాటే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లిలో 15 గుంటలు విస్తీర్ణంలో మహిళా రైతు కొప్పుల కోమల బ్లాక్ రైస్ సాగు చేశారు. తన కుమారుడు బెంగళూరులో ఆయుర్వేద డాక్టర్‌గా శిక్షణ పొందుతున్న క్రమంలో అక్కడి నుంచి తెచ్చిన వరి వంగడాన్ని తెచ్చి సాగు చేసినట్లు వివరించారు. ఆరోగ్యపరంగా పలు ప్రయోజనాలు ఉండటంతో పాటు సాగు సులువుగా చేయవచ్చని.. అందుకే బ్లాక్ రైస్ పండించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహ సంచాలకులు రావుల ఉమారెడ్డి తెలిపారు.

– ఈనాడు, హనుమకొండ–న్యూస్‌టుడే, మొగుళ్లపల్లి

ప్రాణాలతో చెలగాటమా?



అసలే జాతీయ రహదారి... వాహనాలు వాయువేగంతో దూసుకెళ్తాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనంపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ ఇలా కనిపించారు. ముందూ వెనక ఎటువంటి ఆసరా లేకుండా ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పడితే అంతేసంగతులు..

– ఈనాడు,హనుమకొండ

శిక్షణ పొందుతూ.. ప్రత్యక్షంగా వీక్షిస్తూ..



రామప్ప ఆలయంలో వాలంటీర్ల బృందం

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ల శిక్షణ రెండో రోజు కొనసాగింది. బుధవారం ఉదయాన్నే యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. అనంతరం కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు వాలంటీర్లకు శిక్షణ తరగతులను తీసుకున్నారు. రామప్పకు యునెస్కో గుర్తింపు ఎలా వచ్చింది? ఆలయ నిర్మాణ శైలి ఏంటి? కాకతీయులు వాడిన సాంకేతిక పరిజ్ఞానం ఏంటి? ప్రపంచ స్థాయిలో ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఇంకెక్కడైనా ఉందా? గుర్తింపునకు ఎలాంటి కారణాలు దోహదపడ్డాయనే అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మధ్యాహ్నం ప్రొఫెసర్ దేవాప్రతాప్ ఆలయ నిర్మాణంలో వాడిన సామగ్రి, వాటి సేకరణ, ప్రత్యేకంగా ఆ సామగ్రినే ఉపయోగించడానికి గల కారణాలు, వాటికిచ్చిన ప్రాధాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ తరగతుల అనంతరం రామప్ప ఆలయానికి చేరుకుని శిక్షణలో తెలుసుకున్న విషయాలను స్వయంగా ఆలయంలో వీక్షించి వాలంటీర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఆలయంలోని రాగిని, నాగిని శిల్పాలు, సాండ్‌బాక్స్ టెక్నాలజీ, కామేశ్వర, కాటేశ్వరాలయ నిర్మాణాలను స్వయంగా చూశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సామూహికంగా ఫొటోలు దిగారు. కార్యక్రమంలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, పర్యాటకశాఖ అధికారి సూర్యకిరణ్, పురావస్తు, పర్యాటక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాల పరిధిలో యువజన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేందుకు యువజన సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి చింతల అన్వేశ్ బుధవారం తెలిపారు. యువజన సంఘాల్లోని సభ్యుల వయసు 18 నుంచి 29లోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న యువజన సంఘాలు నమోదు కోసం సభ్యుల ఆధార్‌కార్డు, సంఘం ప్రతులను హనుమకొండలోని నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో ఈ నెల 19లోపు సమర్పించాలన్నారు. సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని సమన్వయ అధికారి తెలిపారు. మరిన్ని వివరాలకు 0870 2958776 సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	126
రిటైల్:	148
డ్రెస్డ్:	215
స్కిన్‌లెస్:	244

పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

- కనీస మద్దతు ధర రూ.500 పెంపు
- మార్కెటింగ్ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్



పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు అన్నదాతలు తెల్లబంగారంతో రావడం ప్రారంభమైంది. దీపావళి నాటికి విక్రయాలు జోరందుకుంటాయి. ఈ క్రమంలో మార్కెటింగ్ శాఖ పత్తి కొనుగోళ్లకు చేస్తున్న ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఎన్ని కొనుగోలు కేంద్రాలను నోటిఫై చేసింది? విపణికి సరకు ఏ మేరకు వస్తోంది? తదితర వివరాలతో వరంగల్ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్‌తో సోమవారం 'ఈనాడు' ముఖాముఖి నిర్వహించింది. ఆ వివరాలు.

ఈనాడు, వరంగల్, ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే

ముఖాముఖి

? పత్తి రైతులు సరకుతో మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. ఈసారి కనీస మద్దతు ధర ఏ మేరకు పెరగనుంది?

✔ దసరా పండగ ముగియడంతో రైతులు పెద్ద మొత్తంలో పత్తి పంటతో వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు వస్తున్నారు. ఈసారి వారికి ధర లాభసాటిగా ఉంటుందని భావిస్తున్నాం. కనీస మద్దతు ధర రూ.500 పెరిగింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) క్వింటాకు మద్దతు ధర రూ.7521 చెల్లించనుంది.

? సీసీఐకు విక్రయిస్తే రైతుల ఖాతాల్లో ఎన్ని రోజుల్లో డబ్బులు జమవుతాయి?

✔ రైతులు ఆధార్ అథెంటిఫికేన్ చేసుకుని ఉంటే కొనుగోలు కేంద్రాల వద్ద పని సులువు అవుతుంది. ఆధార్‌తో లింక్ అవడం వల్ల పత్తి విక్రయించిన రెండు మూడు పని దినాల్లో డబ్బులు ఖాతాల్లో జమవుతాయి.

? పత్తి రైతులకు మార్కెటింగ్ శాఖ అన్ని సౌకర్యాలు కల్పిస్తోందా?

✔ రైతులకు సాంకేతికతను చేరువ చేసేందుకు ఒక వాట్సప్ నెంబర్ (8897281111) కూడా మా శాఖ కొత్తగా ప్రవేశపెట్టింది. అందులోకి రైతులు వెళ్లి 'హాయ్' అని టైప్ చేస్తే కావాల్సిన సమాచారం వస్తుంది. ఏ యే జిన్నింగ్ మిల్లుల్లో ఎంత మంది విక్రయాల కోసం వేచిచూస్తున్నారనే వివరాలు తెలుసుకోవచ్చు. ఎనుమాముల మార్కెట్‌లో ఇప్పటికే తాగునీటి వసతి కల్పించాం. విద్యుత్తు సరఫరా, యార్డులను శుభ్రం చేసి పెడుతున్నాం. సీసీఐ కొనుగోలు కేంద్రాలపై కూడా మా సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. రైతులు పెద్ద ఎత్తున రావడానికి ముందే అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. మా శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో సమీక్ష సైతం పూర్తయ్యింది.

? సరకు రాక అంచనా గతేడాదికన్నా పెరిగిందా.. తగ్గిందా?

✔ ఇప్పటికే మేం సరకు రాకపై ఒక అంచనా రూపొందించుకున్నాం. గతేడాది 28.72 లక్షలు మెట్రిక్ టన్నులు వచ్చింది. ఈ ఏడాది సరకు రాక మరింత పెరుగుతుందని వ్యవసాయ శాఖ గణాంకాల ద్వారా స్పష్టమైంది. సుమారు 32.09 లక్షలు మెట్రిక్ టన్నుల పత్తి మార్కెట్‌కు వస్తుందని అంచనా వేశాం. ప్రస్తుతానికి ఎనుమాములకు కొద్ది మొత్తంలో మాత్రమే సరకు వస్తోంది. దీన్ని ప్రైవేటు వ్యాపారులు కొంటున్నారు. వరంగల్, సూర్యాపేట, నల్గొండ, ఆదిలాబాద్, ఖమ్మం, భువనగిరి తదితర జిల్లాల నుంచి అక్టోబరులో సరకు రావడం మొదలవుతుంది. నవంబరులో మిగతా జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో వస్తుంది.

? మద్దతు ధర పెరిగిన నేపథ్యంలో రైతులు ప్రైవేటు వ్యాపారుల కన్నా సీసీఐకే ఎక్కువ పత్తిని విక్రయించే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎన్ని కేంద్రాలను నోటిఫై చేశారు?

✔ ఉమ్మడి జిల్లాలో 58 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ప్రస్తుతం 28 నోటిఫై చేశాం. త్వరలో వంద శాతం మిల్లులను అందుబాటులోకి తెస్తాం. రైతులు నేరుగా ఆ కేంద్రాలకు తీసుకొచ్చి పత్తిని విక్రయించవచ్చు. కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధర వస్తే రైతులు బయట విక్రయించుకోవచ్చు. అప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయి.

? పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చే క్రమంలో రైతులకు మీరిచ్చే సూచనలు ఏమిటి? తేమ శాతం ఎంత వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది?

✔ వచ్చేది చలికాలం కాబట్టి ఉదయం వేళ పత్తిపై తేమ ఎక్కువగా ఉంటుంది. అందుకే తొక్కడానికి సమయం తీసుకోవాలి. లేదంటే తేమ లోపల అలాగే ఉంటుంది.. రైతులు కోసిన వెంటనే తీసుకొస్తే మాయిశ్చర్ ఎక్కువగా నమోదవుతుంది. చాలా మంది రైతులు గ్రేడింగ్ చేయకుండా సరకును తీసుకురావడం వల్ల సీసీఐ వాళ్లు నిరాకరిస్తారు. గ్రేడింగ్ చేయడం మరవొద్దు. తేమ 8 నుంచి 12 శాతం వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో వే బ్రిడ్జ్ మీదున్న బరువును అన్నదాతలు సరిచూసుకోవాలి.

ఎంజీఎంలో అరుదైన శస్త్రచికిత్స

- మహిళా గొంతుపై థైరాయిడ్ గడ్డ తొలగింపు



బాధితురాలితో వైద్య బృందం

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో జనరల్ సర్జరీ విభాగం వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి. . ఓ మహిళ ప్రాణాలు కాపాడారు. వైద్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలానికి చెందిన జన్ను వరలక్ష్మి(46) గొంతుపై 25 సె.మీ. వెడల్పుతో మెడ చుట్టూ ఆక్రమించి ఉన్న థైరాయిడ్ గడ్డతో పదేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. మెదడుకు రక్తప్రసారం చేసే నరాలను గడ్డ చుట్టుముట్టడంతో ఆహారం మింగలేకపోతున్నారు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా. . హైదరాబాద్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినా.. ఫలితం కనిపించలేదు. చివరికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. కానీ ప్రాణాలకు హామీ ఇవ్వలేమని చెప్పారు. దిక్కుతోచని పరిస్థితుల్లో 10రోజుల క్రితం ఎంజీఎం ఆసుపత్రి జనరల్ సర్జరీ వైద్య విభాగానికి వచ్చారు. ప్రొఫెసర్ డా.శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వైద్య బృందం పరీక్షించింది. అన్నిరకాల పరీక్షల అనంతరం బుధవారం సుమారు 5 గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించారు. బాధితురాలి గొంతుపై 25సె.మీ. వెడల్పులో ఉన్న థైరాయిడ్ గడ్డను విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్రచికిత్సలో ప్రొఫెసర్ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు డా. వినోద్‌కుమార్ దుస్సా, సీనియర్ రెసిడెంట్లు, పీజీ వైద్యులున్నారు. శస్త్రచికిత్స అనంతరం బాధితురాలు ఆరోగ్యంగా ఉందని వైద్యులు ధ్రువీకరించారు. కాగా ఇంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను ఎంజీఎం ఆసుపత్రిలో ఉచితంగా చేశారు. శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్యులను ఎంజీఎం సూపరింటెండెంట్ డా.చిలుక మురళి అభినందించారు.

ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు?



వంతెన మీదుగా తిరుగుతున్న ప్రైవేటు వాహనాలు

హనుమకొండ నగరంలో ప్రధానమైన నయీంనగర్ నాలాపై వంతెన నిర్మాణం పూర్తైనా ఆర్టీసీ బస్సులు ఈ మార్గంలో తిరగడం లేదు. ఏటా వర్షాకాలం నాలా పొంగి కాలనీలను ముంచెత్తుతుండటంతో ప్రభుత్వం రూ.7.40 కోట్ల నిధులతో ఈ ఏడాది ఏప్రిల్ 5 నాలా విస్తరణ, వంతెన నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలకు సాగించే ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి నడిపారు. దీనికి అదనంగా టికెట్టుపై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. పనులు పూర్తై, ఆటోలు, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు తిరుగుతున్నా ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సులను ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ మీదుగానే తిప్పుతున్నారు. దీని కారణంగా ప్రయాణికులపై ఆర్థికంగా అదనపు భారం పడటమేకాకుండా.. కరీంనగర్, సిద్దిపేట, వేములవాడ, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి సమయం కూడా వృథా అవుతోంది. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

అవిభక్త కవలలకు 22 ఏళ్లు

- సొంతగ్రామంలో పుట్టినరోజు వేడుకలు



కేక్ తినిపిస్తున్న వీణ-వాణి తల్లిదండ్రులు మురళి-నాగలక్ష్మి

దంతాలపల్లి, న్యూస్‌టుడే: దంతాలపల్లి మండలం బీరిశెట్టి గూడెం గ్రామానికి చెందిన అవిభక్త కవలలు వీణ, వాణి ఇరవై ఏళ్ల అనంతరం తమ సొంతింట్లో పుట్టిన రోజు వేడుకలను జరుపుకొన్నారు. మారగాని మురళి-నాగలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వీరు జన్మించారు. 13 ఏళ్ల పాటు నీలోఫర్ ఆసుపత్రిలోనే ఉన్నారు. అనంతరం స్టేట్‌హోంకు తరలించారు. అప్పటి నుంచి అక్కడే పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. స్టేట్‌హోం సూపరింటెండెంట్లు సఫియాఖాన్, సోమలక్ష్మితో కలిసి హైదరాబాద్ నుంచి బీరిశెట్టి గూడెం చేరుకోగా ఈసారి తమ ఇంట్లో బుధవారం 22వ జన్మదినాన్ని జరుపుకొన్నారు. బంధువులు, గ్రామస్థులు హాజరయ్యారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలని, పిల్లలతో కలిసి ప్రతి జన్మదినాన్ని జరుపుకొనేలా అవకామివ్వాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పలువురు వీరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మేడారం జాతరలో శాశ్వత ఏర్పాట్లకు కృషి



వనదేవతలకు కుటుంబసమేతంగా పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

మేడారం(తాడ్వాయి), న్యూస్‌టుడే: మా కుల దైవమైన సమ్మక్క, సారలమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి కుటుంబసమేతంగా బుధవారం మేడారం వచ్చి తన మనవడి పుట్టువెంట్రుకలు సమర్పించారు. అమ్మవార్లకు ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత మహా జాతర సందర్భంగా కోరిన కోర్కెలు తీరినందుకు మేడారం వచ్చి మొక్కులు చెల్లించామన్నారు. మేడారాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఎక్కువ అభివృద్ధి చేసిందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో తమ ప్రభుత్వం ఉన్నట్లయితే జాతీయ హోదా దక్కి మరింత అభివృద్ధి చెందేదని తెలిపారు. రాబోయే జాతరనాటికి భక్తులకు అన్ని రకాల శాశ్వత ఏర్పాట్లు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధించి ప్రజలకు మేలు జరగాలని దేవతలను వేడుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్, దేవాదాయశాఖ డీసీ శ్రీకాంత్‌రావు, తహసీల్దారు రవీందర్, ఎంపీవో శ్రీధర్‌రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

బమ్మెర పర్యాటకాభివృద్ధి పనులపై నీలినీడలు

పాలకుర్తి, న్యూస్‌టుడే

జనగామ జిల్లాలోని బమ్మెర, వల్మిడి, సోమేశ్వరాలయం, పాలకుర్తికి తరాల చరిత్ర ఉంది. ఇక్కడ ఎందరో మహానుభావులు, కవులు, కళాకారులు, పోరాటయోధులు పురుడుపోసుకున్నారు. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం 2017లో సుమారు రూ.23 కోట్లు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. వల్మిడి, పాలకుర్తిలో 90 శాతం మేర నిర్మాణాలు పూర్తి కాగా, బమ్మెరలో మాత్రం ఏళ్లుగా ఆగుతూ. . సాగుతూ.. వస్తున్నాయి.

40 శాతం మేర నిర్మాణ దశలోనే..



పురోగతి కనిపించని స్మారక కేంద్రం

బమ్మెరలో సహజ కవి పోతన చారిత్రక ఆనవాళ్లు ఉన్న ప్రదేశంలోనే సుమారు 4 ఎకరాల స్థలంలో పర్యాటకాభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో పోతన స్మృతివనంతో పాటు గ్రంథాలయం, అక్షరభ్యాస కేంద్రం, విడిది కేంద్రాలు, సమాధి, బావి పునరుద్ధరణ, ఆడిటోరియం తదితరాలు చేపట్టగా, అవి ఇంకా నిర్మాణ దశలోనే మగ్గుతున్నాయి. అలాగే రూ.3 కోట్లతో పోతన కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొన్నాళ్లుగా నిలిచిన పనులపై స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాషాలు ఇతర శాఖల అధికారులతో పలుమార్లు సమీక్షించారు. చేసిన వాటికి బిల్లులు రాకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇంకా 40 శాతం మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బమ్మెరను అభివృద్ధి చేస్తే పర్యాటకుల రాకతో ఆదాయం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే సోమేశ్వరాలయం ఆ ఖ్యాతిని దక్కించుకోగా, అక్కడి నుంచి వచ్చే భక్తులు బమ్మెర, వల్మిడి ప్రాంతాలను సైతం సందర్శిస్తున్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి సరైన వసతులు, సౌకర్యాలు మెరుగుపరచాల్సి ఉంది.



అసంపూర్తిగా ఆడిటోరియం నిర్మాణం..

పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి..

- మామిడాల యశస్విని రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే

గత గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే పర్యాటకాభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పనుల పురోగతి, ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించి, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటాం. రానున్న రోజుల్లో పాలకుర్తి, బమ్మెర, వల్మిడి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి చేస్తా.

స్తంభం తొలగించకుండానే రోడ్డేశారు..!



వెంకటాపురం(ములుగు జిల్లా), న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ బాధ్యతారాహిత్యం, గుత్తేదారు నిర్లక్ష్యం ఆ గ్రామస్థులకు అపాయాన్ని కలిగించేలా చేసింది. వెంకటాపురం మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో నడిరోడ్డుపైనే విద్యుత్తు స్తంభం ఉన్నా.. తొలగించకుండానే సిమెంట్ రహదారి నిర్మాణం చేపట్టడం విమర్శలకు దారి తీస్తోంది. ఇక్కడి పరిస్థితిని 'ఈనాడు' ఈ నెల 8వ తేదీన 'స్తంభం ముప్పు.. కలగాలి కనువిప్పు..!' అనే శీర్షికతో సూచించినా.. అధికారులు, రహదారి నిర్మాణ బాధ్యులు చలనం లేకపోవడంపై గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్ రహదారిపై వాహనాలు వేగంగా దూసుకొస్తే ప్రాణాపాయంలో చిక్కుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న స్తంభం ద్వారా ఎవరైనా ప్రాణాలు కోల్పోతే, ఆస్తినష్టం జరిగితే యంత్రాంగం స్పందిస్తుందా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

రహదారికి మరమ్మతులు చేపట్టండి!



ములుగు రూరల్, న్యూస్‌టుడే: రహదారి అధ్వానంగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గుంతలు పడ్డ మార్గంలో ప్రయాణించడం కష్టంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ములుగు మండలంలోని మల్లంపల్లి గ్రామం నుంచి దేవనగర్ వెళ్లే దారి పూర్తిగా ధ్వంసమైంది. సుమారు మూడు కిలోమీటర్ల మేర గుంతలు పడి అధ్వానంగా మారింది. ద్విచక్రవాహనదారులు రాత్రివేళల్లో ప్రయాణిస్తూ అదుపుతప్పి జారిపడుతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రయాణం నరకంగా ఉందని, మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ములుగు, న్యూస్‌టుడే: విద్యుత్తు మరమ్మతుల నేపథ్యంలో ములుగు మండలంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 17న కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కె.వెంకటరెడ్డి తెలిపారు. ములుగులోని లారీ అసోసియేషన్ ప్రాంతంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ములుగు మండలం జగ్గన్నపేట ప్రాంతంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



ఎంఈవో కేశవరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలో విధులు నిర్వహించే ఉపాధ్యాయుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని యూటీఎఫ్ మండలశాఖ విజ్ఞప్తి చేసింది. మండల విద్యావనరుల కేంద్రంలో నూతన మండల విద్యాధికారి రేగ కేశవరావును మండల కమిటీ సభ్యులు కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. వివిధ కారణాలతో భర్తీకి నోచుకోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, మండలంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సుతారి పాపారావు, ప్రధాన కార్యదర్శి అల్లె భాస్కర్, ఉపాధ్యాయులు పొలిశ సమ్మయ్య, గుమ్మడి ప్రభాకర్, రజిత, చంద్రారెడ్డి, లక్ష్మయ్య, రవికుమార్, రాజేష్, నీలం బాబు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: అపరిచిత వ్యక్తుల పట్ల బ్యాంకు అధికారులు, ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. తమిళనాడు నుంచి వచ్చిన ఆరుగురు వ్యక్తులు మూడు ద్విచక్రవాహనాలపై రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తున్నారని, బ్యాంకుల నుంచి నగదు తీసుకెళ్లే వారి దృష్టి మరల్చి దొంగతనానికి పాల్పడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మూడు బృందాలతో బుధవారం ములుగు మండలంలోని 11 బ్యాంకులలోని అధికారులకు, ఖాతాదారులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలని, ప్రతి గంటకోసారి బ్యాంకు పరిసరాలను గమనించాలని సూచించారు. అధిక మొత్తంలో నగదు డ్రా చేసుకునే ఖాతాదారులకు జాగ్రత్తలు చెప్పాలని వివరించారు.

జోరుగా సీతాఫలాల అమ్మకాలు



జనగామలోని వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై సాగుతున్న విక్రయాలు

బచ్చన్నపేట (జనగామ), న్యూస్‌టుడే: తెలంగాణ ఆపిల్‌గా పేరొందిన సీతాఫలం క్రయవిక్రయాలు జనగామ జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. రోజుకు రూ.లక్షల్లో అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు నిలిచిపోవడంతో పల్లె వాసులు కుటుంబ సభ్యులతో కలిసి అడవిబాట పడుతూ కాయలను తెంపి, ప్రధాన రహదారులపై అమ్ముతున్నారు. ధర ఎక్కువైనా తగిన పోషకాలు మెండుగా ఉండటంతో స్థానికులు, ప్రయాణికులు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

ధర ఎక్కువైనా.. మక్కువతో..

జనగామ, చేర్యాల, బచ్చన్నపేట, నర్మెట్ట తదితర మండలాల నుంచి జిల్లా కేంద్రంలోని ఏరియాసుపత్రి వద్ద ఉన్న మార్కెట్, వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపైన విక్రయాలు జరుపుతున్నారు. గంప లెక్కన ఒక్కో దానికి రూ.400 నుంచి రూ.600 వరకు అమ్ముతుండగా, జనాలు తగిన బేరంతో తీసుకుంటున్నారు. బచ్చన్నపేట మండలం మన్సాన్‌పల్లి అటవీ ప్రాంతం నుంచి రెండు రోజులకోసారి వాహనంలో జిల్లా మార్కెట్‌కు తరలిస్తున్నారు. జిల్లా నుంచి హైదరాబాద్, మిర్యాలగూడ, కోదాడ, విజయవాడ, రాజమండ్రి, ఒంగోలు, గుంటూరు తదితర ప్రాంతాలకు కాయల సైజును బట్టి ఎగుమతి చేస్తున్నారు.

పోషకాలు మెండు..

ఈ ఫలంలో పోషకాలు కూడా మెండుగా ఉన్నాయి. వీటి ఆకులు మధుమేహాన్ని అదుపులో ఉంచడం, అధిక బరువు తగ్గించడంతో పాటు జలుబును కూడా నివారిస్తుంది. పండ్లలో కెరోటిన్, థయామిన్, రిబోఫ్లేవిన్, నియాసిన్, విటమిన్ సీ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. లోపలి గుజ్జు తింటే జీర్ణక్రియ కూడా వేగవంతంగా పనిచేస్తుంది. అందుకే పలు కంపెనీలు కూడా మందుల తయారీకి వీటిని వినియోగిస్తూ, దిగుమతి చేసుకుంటున్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



పాత్రాపురం వద్ద సామగ్రిని పరిశీలిస్తున్న సీఐ కుమార్

వెంకటాపురం, న్యూస్‌టుడే: దండకారణ్య సరిహద్దుల్లో పోలీసులు నిఘాను పెంచారు. వెంకటాపురం-భద్రాచలం ప్రధాన మార్గంలో బుధవారం సీఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. మండలంలోని పాత్రాపురం సమీప బల్లకట్టు వారధి వద్ద ఇరు మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనాలను నిలిపి శోధించారు. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, వెంకటాపురం, వాజేడు, ఏటూరునాగారం, ములుగు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మద్దేడు, భూపాలపట్నం మార్గాల్లో రవాణా చేస్తున్న ప్రయాణికులు, గూడ్సు వాహనాలను పరిశీలించారు. ప్రతీ వాహనదారులు విధిగా రహదారి భద్రతా ప్రమాణాలను పాటించడంతో పాటు ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో అనుమానితులను తరలించవద్దని, కొత్త వ్యక్తులు ఎవరైనా రవాణా చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ మార్గంలో ఇసుక తరలిస్తున్న లారీలను నిలిపి పరిశీలించారు. తనిఖీల్లో శిక్షణ ఎస్సై ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



వెంకటాపురంలో ఎంఈవో సత్యనారాయణ, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు



ములుగులో నియామక పత్రాలను అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాసులు



మంగపేటలో ఎంఈవో పొదెం మేనక

ములుగు, న్యూస్‌టుడే: జిల్లాలో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు బుధవారం ఎంతో ఉత్సాహంతో విధుల్లో చేరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి ఉపాధ్యాయ నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయులు ఈనెల 15న జరిగిన పాఠశాలల కేటాయింపు ప్రక్రియలో పాల్గొన్నారు. బుధవారం ఉదయం జిల్లాలోని ఆయా మండల విద్యావనరుల కేంద్రం వద్దకు వెళ్లి ఎంఈవోల ద్వారా కేటాయించిన పాఠశాల నియామకపు పత్రాన్ని అందుకుని, అక్కడి నుంచి నేరుగా స్కూలు కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయుని వద్దకు చేరుకొని తమ వద్ద ఉన్న ధ్రువపత్రాలను సమర్పించి నేరుగా పాఠశాలలకు వెళ్లి విధుల్లో చేరారు.



వాజేడు మండల కేంద్రంలో ఎంఈవో వెంకటేశ్వర్లు

వాజేడు: మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలతో విద్యాబోధన కష్టంగా మారింది. మండలానికి మంజూరైన పోస్టులతో ఉపాధ్యాయుల కొరత తీరనుంది. నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు.

వెంకటాపురం: మండలంలో నియామకమైన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణకు కలిసి నియామక పత్రాలను అందుకున్నారు. ఈ మేరకు వారికి కేటాయించిన బడుల్లో చేరారు. నూతనంగా విధుల్లో చేరిన వారికి వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియామక పత్రాలను సమర్పణలో సహకరిస్తూ ఆయా సంఘాల్లో చేర్చుకున్నారు.

మంగపేట: మండలంలో 14 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఎంఈవో పొదెం మేనక నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యాహక్కు చట్టంపై అవగాహన

ములుగు, న్యూస్‌టుడే: విద్యాహక్కు చట్టంపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. బుధవారం ములుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. 18 ఏళ్లు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలని, బాల్య వివాహాలు చేయడం చట్టపరంగా నేరమని వివరించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోతు స్వామిదాస్, అసిస్టెంటు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు బి.ఆర్.ఉమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎంపిక



నరేందర్

నర్సింహసాగర్(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని నర్సింహసాగర్‌కు చెందిన మురుకుట్ల నరేందర్‌ను ములుగు జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా నియమించినట్లు జిల్లా కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేసినట్లు నరేందర్ తెలిపారు.

నేడు వాల్మీకి జయంతి వేడుకలు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధికారులు, ఆయా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చేపల పెంపకంతో ఉపాధి అవకాశాలు



చేపపిల్లలు అందజేస్తున్న మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు సురేందర్

తాడ్వాయి, న్యూస్‌టుడే: ఏజెన్సీ గిరిజనులు చేపల పెంపకాన్ని లాభసాటిగా చేపట్టి ఆర్థికంగా బాగుపడాలని గిరిజన మత్స్యకార సహకార సంఘ జిల్లా అధ్యక్షుడు సిద్దబోయిన సురేందర్ పేర్కొన్నారు. తాడ్వాయి మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో బుధవారం మండలంలోని 96 చెరువుల మత్స్యకార సహకార సంఘాలకు ఉచిత చేపపిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిశాయని, చెరువుల నిండా నీరు ఉన్నందును చేపపిల్లలను సంరక్షించుకుని అధిక లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి రమేష్, పెసా సమన్వయకర్త కొమురం ప్రభాకర్, మత్స్యసహకార సంఘాల అధ్యక్షులు బంగారు సాంబయ్య, చర్ప చంద్రశేఖర్, మల్లెల నాగేశ్వర్‌రావు, మనోహర్, అల్లెం సంజీవ్, వట్టం విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి



కాటాపురంలో గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

ములుగు, న్యూస్‌టుడే: ఈనెల 18న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం కరపత్రాలను ములుగులో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర సదస్సులో కల్లుగీత కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు బుర్ర శ్రీనివాస్, కుమార్, అశోక్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలోని కాటాపురం ఎల్లమ్మదేవత గుడి ఆవరణలో గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ నెల 18న హైదరాబాదులో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, తదితరులు హాజరు కానున్నారన్నారు. గౌడ కులస్థులు పార్టీలకతీతంగా హాజరుకావాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్యగౌడ్ కోరారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఒకరి దుర్మరణం.. ఇద్దరికి తీవ్ర గాయాలు



వెంకటేశ్వరరావు (పాతచిత్రం)

వెంకటాపూర్, న్యూస్‌టుడే: భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్-జంగుపల్లి గ్రామాల మధ్య బుధవారం సాయంత్రం లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో జంగుపల్లి గ్రామానికి చెందిన పేరాల వెంకటేశ్వరరావు(16) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం జంగుపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు, వి.మణిప్రసాద్, జె.జశ్వంత్‌లు పెద్దాపూర్ నుంచి జంగుపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో జంగుపల్లి నుంచి పెద్దాపూర్‌కు అతివేగంతో వస్తున్న లారీ మూలమలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ టైరు కింద వెంకటేశ్వరరావు పడి నుజ్జునుజ్జయిపోయాడు. మిగతా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం మేరకు వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్ సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యాసామగ్రి అందజేత



గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గోవిందరావుపేట గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం బాలరక్ష భారత్ ప్యూర్ ప్లే, విద్యాశాఖ సంయుక్తంగా గ్రంథాలయానికి సంబంధించిన పుస్తకాలతో పాటు డస్ట్ బిన్‌లు, విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎన్.అన్నమేరి మాట్లాడుతూ.. అందరూ చదవాలి .. అందరూ ఎదగాలి అనే ఉద్దేశంతోనే విద్యార్థులకు గ్రంథాలయం పుస్తకాలు అందజేస్తున్నారని చెప్పారు. గ్రంథాలయం బాలరక్ష పుస్తకాలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బాలరక్ష భారత్ ప్రతినిధి తేజావత్ రవికుమార్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజుపేట(మంగపేట): మండలంలో రాజుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల రక్షభారత్ ఆధ్వర్యంలో ప్యూర్ ప్లే స్వచ్ఛంద సంస్థ సహకారంతో పాఠశాలకు గ్రంథాలయ పుస్తకాలు, తరగతి గదులకు డస్ట్ బిన్‌లను బహూకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బానోతు బాలాజి, బాల రక్షా భారత్ కో ఆర్డినేటర్ రమేశ్ ఉపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తాం..



రాంనగర్ గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: వారం రోజుల్లోగా ఏటూరునాగారం మండలంలోని రాంనగర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయిస్తానని సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. ఆ గ్రామంలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఏటూరునాగారం నుంచి రామన్నగూడెం, రాంనగర్ గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సును కమలాపురం, మంగపేట వరకు ఏర్పాటు చేయాలని పలువురు గ్రామస్థులు ఈ సందర్భంగా కోరారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో తాము ఎంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. స్పందించిన సీఐ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, వెంటనే వరంగల్-2 డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామంలో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయని, కొన్ని స్తంభాలకు ఆనుకుని చెట్లు ఉన్నాయని చెప్పారు. వెంటనే విద్యుత్తు శాఖ ఏఈ అశోక్‌తో మాట్లాడి రాంనగర్ గ్రామంలో కిందకు వేలాడుతున్న వైర్లను సరిచేయాలని సూచించారు.

24న కుమురంభీం విగ్రహావిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: గ్రామగ్రామాన ఘనంగా కుమురం భీం వర్ధంతిని నిర్వహించుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ పిలుపునిచ్చారు. ఆకులవారి ఘణపురం వైజంక్షన్‌లోని కుమురం భీం విగ్రహం వద్ద బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జల్, జమీన్, జంగిల్‌పై హక్కుల కోసం కుమురం భీం బాటలో ప్రతి ఆదివాసీ పోరాడాలని పిలుపునిచ్చారు. వై జంక్షన్‌లో ఈ నెల 24న కొమురం భీం విగ్రహావిష్కరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీలంతా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పొడెం రత్నం, పొదెం కృష్ణప్రసాద్, కొటె రవి, వంక నరేష్, ఇర్ప హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

'ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తే సహించం'



పూనెం సాయి, జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి

వాజేడు, న్యూస్‌టుడే: ఇందిరమ్మ కమిటీలు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధమని, పెసా గ్రామసభల ద్వారానే ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఎంపిక జరగాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ (జీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్టాలకు అనుగుణంగా గ్రామసభల ద్వారానే ఎంపిక జరగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను పట్టించుకోకపోవడం అన్యాయమని తెలిపారు. ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తే సహించమని హెచ్చరించారు.

ఆర్థిక సాయం

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం మండల కేంద్రంలోని మానసపల్లి ప్రాంతానికి చెందిన జగజంపుల రాజేందర్ అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన కుటుంబానికి భారాస జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు సమకూర్చిన రూ.5 వేల ఆర్థిక సాయాన్ని నాయకులు సునీల్‌కుమార్, మల్లారెడ్డి, గండెపల్లి నర్సయ్య, ఖాజాపాషా, రాంనర్సయ్య, కాళ్ల రామకృష్ణ, చంద్రబాబు, రాజబాబు తదితరులు మృతుడి కుటుంబానికి అందజేశారు.

ములుగు రూరల్: ములుగు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన రెడ్డబోయిన రాజు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. మృతుడి పిల్లలకు పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కూనూరు అశోక్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షులు జగన్, నాయకులు శ్రీధర్, భిక్షపతి, మొగిలి, శ్రీను, లక్ష్మణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

డోర్నకల్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో న్యాయం జరగడం లేదని మంత్రులే పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కే పాలన కొనసాగుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ధ్వజమెత్తారు. బుధవారం డోర్నకల్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో లోపాలను వేలెత్తి చూపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంట్లో దొంగలు పడిన సంఘటన ప్రస్తావిస్తూ మిమ్మల్ని మీరు కాపాడుకోలేరు.. ప్రజలను పట్టించుకోరు ఏటూ పోతుంది మీ పాలన అని ప్రశ్నించారు. అధికారం చేపట్టి పది నెలలు గడిచిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు పొరపాటున ఓటు వేశామని ప్రజలు మదన పడుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ లేదన్నారు. భారాస పాలనలో షీ టీం ఏర్పాటుతో స్త్రీలకు భరోసా కలిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఇతర విభాగాల ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనా జీతాలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో మంత్రులు లేని శాఖలు చాలా ఉన్నాయని, వాటిపై ముఖ్యమంత్రికి సమీక్ష జరపాలనే ఆలోచన రాకపోవడం దారుణమని సత్యవతిరాథోడ్ దుయ్యబట్టారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విద్యాసాగర్, సింగిల్ విండో ఛైర్మన్ బిక్షంరెడ్డి, నాయకులు మన్యుపాట్నీ, యశోధర్‌జైన్, కొత్త వీరన్న, కందుల మధు, రామభద్రం, ఎండీ గౌస్ ఉన్నారు.

డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు అవకాశం

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు రాత, ప్రయోగ, సెమినార్ తదితర పరీక్షలు 2024-25 విద్యా సంవత్సరం కాలపరిమితికి సంబంధించి క్లియర్ చేయడానికి అవకాశం కల్పించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేసారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, వీటికి సంబంధించిన పరీక్షా రుసుం వివరాలు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

చిన్న కాళేశ్వరం సర్వే పనుల అడ్డగింత

కాటారం, న్యూస్‌టుడే: చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రతాపగిరి గ్రామ పరిధిలో పంట భూముల్లో కాలువల నిర్మాణం కోసం చేపడుతున్న సర్వేను స్థానిక రైతులు బుధవారం అడ్డుకున్నారు. పంట భూముల్లో సర్వే నిమిత్తం పాతిన జెండాలను తీసేశారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో చెరువులకు సాగునీరు అందిస్తే రెండు పంటలు సాగయ్యే అవకాశం ఉన్నా.. కాల్వలతో అధికంగా భూములను కోల్పోతామని ఆరోపించారు. కాల్వలతో పంట భూముల సాగుకు ఇబ్బందులు ఏర్పడతాయని, జీవనాధారమైన భూములు కోల్పోయి ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి తలెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వలు లేకుండా సమీప చెరువులను అనుసంధానిస్తూ సాగునీరు అందించే ప్రయత్నం చేయాలని కోరారు. అనంతరం కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, తహసీల్దార్ నాగరాజును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు రాజబాబు, రమేష్, మాధవ్, కిష్టయ్య, పర్వతాలు, పోచయ్య, లింగయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.